జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 3-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 182 పేజీలు: 8 వెల : రూ.7

# అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

* కేంద్ర విదేశాంగ మంత్రితో మాట్లాడుతా
* ఆహారం అందేలా చూస్తా
* త్వరలో స్వదేశానికి తీసుకువస్తాం
* కుటుంబీకులు ఆందోళన చెందవద్దు
* సౌదీలో చిక్కుకున్న జిల్లావాసులకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు హామీ
* బాధితులతో ఫోన్లో మాట్లాడిన కేంద్ర మంత్రి
* కేంద్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్
* కృతజ్ఞతలు తెలిపిన బాధితుల తల్లిదండ్రులు




**శ్రీకాకుళం, డిసెంబర్ 2 (వార్త):** పొట్టకూటి కోసం విదేశాలకు వెళ్లి, యాజమాన్యాల చెరలో చిక్కుకున్న వలస కార్మికులకు అండగా ఉంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భరోసా కల్పించారు. బాధితులందరినీ స్వదేశానికి తీసుకు వచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖపై ఒత్తిడి తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, నందిగాం, ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన దాదాపు 30 మంది వలస కార్మికులు సౌదీ వెళ్లి, చిక్కుకున్న విషయం తెలిసిందే. రెండు నెలలు పని చేసినా సంబంధిత యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం, గత 4 రోజులుగా తిండి కూడా లేకపోవడంతో వారంతా అల్లాడిపోయారు. ఈవిషయం 'వార్త'లో 'సౌదీలో నరకయాతన' శీర్షికన కథనం ప్రచురితమైంది. బాధిత కుటుంబాల ద్వారా సమస్యను తెలుసుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్.. ఢిల్లీలో పార్లమెంటు సమావేశాల్లో ఉన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన... బాధిత కార్మికులతో సోమవారం మాట్లాడారు. అందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకు వచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను కలిసి, ఒప్పిస్తానని ప్రకటించారు. అలాగే భారత ఎంబసీ కార్యాలయానికి సమస్యను చేరవేసి.. ఆహారం, ఇతర ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. దీంతో ఎంతో ఉపశమనం లభించిందని బాధితులు , వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## సౌదీలో.. నరకయాతన

* ఉపాధి నిమిత్తం వెళ్లిన జిల్లావాసులు
* రెండు నెలలుగా జీతాలు ఇవ్వని కంపెనీ యాజమాన్యం
* పస్తులుంటున్నట్టు కుటుంబీకులకు సమాచారం
* ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కుటుంబీకులకు ఫోన్లు
* ఆందోళనలో కుటుంబీకులు

**పలాస, నవంబర్ 30 (వార్త):** టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజక వర్గాలకు చెందిన సుమారు 30 మంది సౌదీలో నరకయాతన పడుతున్నారు. పొట్టకూటి కోసం వారంతా ఇచ్ఛాపురం, పూండిలోని ఇనిస్టిట్యూట్ ద్వారా సౌదీలోని కొంబన్ అనే కంపెనీలో పనిచేసేందుకు వెళ్లారు. అక్కడ రెండు నెలలుగా పని చేయించుకున్న కంపెనీ యాజమాన్యం జీతాలు ఇవ్వకపోవడంతో వారు నానాఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు తమ వెంట తీసుకువెళ్లిన డబ్బులతో చాలీచాలని తిండి తింటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు రోజులుగా చేతుల్లో డబ్బులు లేక ఆకలితో అలమటిస్తున్నామని వారు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. కంపెనీ యాజమాన్యానికి వారు అడిగితే మీరేం చేసుకుంటారు చేసుకోండని, మీ దేశానికి ఎలా వెళ్తారో చూస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఏం చేయాలో తెలియక దిక్కుతోచనా స్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంపించిన ఇనిస్ట్యూట్ వారికి ఫోన్లో అడిగితే మేము పంపించిన వరకే మా బాధ్యత తర్వాత మాకు సంబంధం లేదని వారు చేతులెత్తేశారని వాపోయారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకు వెళ్లాలని తల్లిదండ్రులను కోరారు.



# బాధితులకు ఎస్పీ భరోసా

* చట్ట ప్రకారం వినతులు పరిష్కరించాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశం
* ప్రజా ఫిర్యాదులు స్వీకరణకు 50 వినతులు



**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్2 (వార్త):** ప్రజా ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని, తక్షణం చట్టప్రకారం వాటికి పరిష్కారం చూపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి 50 ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియపరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

## ఆదిత్యుని అంతరాలయ తలపులకు వెండి తాపడం

**24 కేజీల 500 గ్రాముల వెండిని ఇచ్చిన అజ్ఞాత భక్తుడు**

**అరసవల్లి, డిసెంబర్ 2 (వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారికి విశాఖపట్నం వాస్తవ్యులు, ఒక అజ్ఞాత భక్తుడు ఆలయ అంతరాలయ టేకు తలుపులకు వెండితో తాపడం చేశారు. ఇందుకు గాను 24 కేజీల 500 గ్రాములు వెండికి సమకూర్చారు. సుమారు 30 లక్షలు విలువ గల వెండి తాపడం అజ్ఞాత భక్తుడు తరపున వారి సహాయకుడు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మకి, ఆలయ కార్య నిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఏసు మార్గం అనుసరణీయం




5లో

* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* నగరంలో పలు చర్చిల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 దరఖాస్తులు



**పలాస, డిసెంబర్ 2(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు దరఖాస్తులు వచ్చాయి. బర్త్ సర్టిఫికెట్లు, వితంతు పింఛన్లు, టిడ్కో ఇళ్ల వంటి పలు సమస్యలపై పలువురు దరఖాస్తులు అందించారు. 14 దరఖాస్తులు రాగా అందులో బర్త్ సర్టిఫికెట్లకు 8, పింఛన్లకు 6 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆదేశించారు.

# పీఎం సూర్యఘర్‌ని వినియోగించుకోండి



**శ్రీకాకుళం, డిసెంబర్ 2(వార్త):** పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన.. జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్‌తో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద జిల్లా అధికారులంతా కార్యాలయాలు, గృహాలు వద్ద సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులను సంప్రదించాలని సూచించారు. పీఎంజేఏవై ఆరోగ్యకార్డులు మిగిలితే తక్షణమే వెనక్కి పంపాలని స్పష్టం చేశారు. 70 ఏళ్ల వయస్సు దాటిన వారికి నూతనంగా నమోదు చేయాలని డీఎంహెచ్‌వోకు ఆదేశించారు. కంచిలి-4, లావేరు-3, నందిగాం-2 మండలాల్లో పీజీఆర్ఎస్ రీ ఓపెన్ 9 అర్జీలు ఉండగా రీ ఓపెన్ లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లో జిల్లా పరిపాలన కార్యాలయంలో కేటాయించిన స్థలం సరిపోతుందా లేదా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీజీఆర్ఎస్‌పై ఆయన డివిజన్ల వారీగా ఆర్డీవోలతో సమీక్షించారు. మండలాల్లో ఉన్న అర్జీలపై ఆయన తహసీల్దార్లను అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, విభిన్న ప్రతిభావంతులు, మత్స్య, పౌర సరఫరాలు తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై 70 అర్జీలు స్వీకరించారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి వ్యాపారుల ఆస్తుల జప్తు

**శ్రీకాకుళం, డిసెంబర్ 2(వార్త):** విశాఖపట్నం రేంజ్ పరిధిలో గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తు, ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిని రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జట్టి సోమవారం ఆన్‌లైన్‌లో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వ్యాపారుల ఆస్తులను గుర్తించి, వాటిని జప్తు చేస్తామన్నారు. ఇంతవరకు నమోదైన గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన నిందితులు, వారు గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన ఆస్తులను గుర్తించాలన్నారు. నిందితుల పేరున గుర్తించిన ఆస్తులను జప్తు చేసేందుకు చేపట్టాల్సిన విధి, విధానాలు, నిబంధనలను అధికారులకు వివరించారు. ఆస్తుల జప్తుకు చట్టపరంగా ఏ చిక్కులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రేంజ్ పరిధిలో ఇంతవరకు నమోదైన కేసుల్లో ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిని అధికారులను డీఐజీ అడిగి తెలుసుకొని, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్, మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి, అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా పోరాటాలతోనే బలమైన ప్రతిపక్షం



**పలాస, డిసెంబర్ 2(వార్త):** ప్రజా పోరాటాలతోనే బలమైన ప్రతిపక్షాన్ని నిలపగలమని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తామాడ సన్యాసిరావు అన్నారు.

ఈ నెల 4న విజయవాడలో నిర్వహించే ప్రజా హక్కుల సభ, ర్యాలీ గోడ పత్రికలను బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు బీజేపీతో అంటకాగుతున్నందున, బలమైన ప్రజా పోరాటా ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోగలమని పిలుపునిచ్చారు. ప్రజా హక్కుల సభకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు పెద్ద ఎత్తున బయలుదేరి, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లీడింగ్ కమిటీ సభ్యులు మద్దిల రామారావు, వంకల అప్పయ్య, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి కామేశ్వరరావు, పోతనపల్లి అప్పారావు, గేదెల జగదీష్, ఎన్.యుగంధర్, దున్న శ్రీను, మద్దిల జగదీష్, రాజారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌ల దొంగ అరెస్టు




**పలాస, డిసెంబర్ 2(వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలో ఇటీవల వరుసగా జరుగుతున్న బైక్ దొంగతనాల కేసును పోలీసులు చేధించారు. సోమవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు వివరాలను డీఎస్పీ వెంకటప్పారావు మీడియాకు వివరించారు. ఒడిశాలోని రాయగడ ప్రాంతానికి చెందిన అమర్‌బుయాన్ తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసినట్టు తెలిపారు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న అమీర్ ఈజీమనీ సంపాదనలో పడి ఈ దొంగతనాలు చేసినట్లు చెప్పారు. జిల్లాలో చోరీకి గురైన 15 బైకులను ఆయన నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. చేసినట్లు వెల్లడించారు. చోరీ చేసిన ఓ బైక్‌ను విశాఖలో విక్రయించేందుకు వెళ్తుండగా కాశీబుగ్గ సీఐ మోహనరావు మాటు వేసి నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన.. సీఐ మోహనరావు, సిబ్బంది గౌరయ్య, షణ్ముఖరావు, నీలకంఠం, ప్రసాద్‌ను అభినందించారు.



## సంకల్పంతోనే ఉన్నత భవిష్యత్

**పోలాకి, డిసెంబర్ 2(వార్త):** సంకల్పంతోనే విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు అధిరోహించగలరని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన ప్రియాగ్రహారంలో గల గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్య ద్వారా అనేక రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. సత్ప్రవర్తన గల స్నేహితులతో కలిసి ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సంస్కారంతో విజయాలు సాధించవచ్చన్నారు. ఎస్ఐ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ మంచి పౌరులుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుడికి అపూర్వ స్వాగతం



**పలాస, డిసెంబర్ 2(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం కొండవూరు గ్రామానికి చెందిన కొరికాన మల్లేష్ దేశ రక్షణ కోసం సైన్యంలో చేరి విశిష్ట సేవలు అందించారు. సోమవారం నాడు ఆర్మీలో పదవీ విరమణ పొంది తన స్వగ్రామానికి విచ్చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ ప్రజలు భారీగా పలాస రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆయనను గ్రామ ప్రజలు, స్నేహితులు బంధుమిత్రులు,మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో మల్లేష్ కుటుంబసభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు నేడు కృత్రిమ అవయవాల పంపిణీ



**మందస, డిసెంబర్ 2(వార్త):** మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేస్తున్నట్టు ఎంవీఏ వ్యవస్థాపక ఛైర్మన్ మల్లారెడ్డి భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. పలాస, ఇచ్ఛాపురం, ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఇటీవల ప్రత్యేక శిబిరాలను నిర్వహించి దివ్యాంగులను గుర్తించామన్నారు. విజయనగరానికి చెందిన శ్రీగురు దేవ ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో సుమారు 43మందికి కృత్రిమ అవయవా లను అందజేయనున్నట్టు భాస్కరరావు తెలిపారు.

## సంగమేశ్వరుని ఆదాయం రూ.54వేలు

**వంగర, డిసెంబర్ 2(వార్త):** కార్తీకమాసం సందర్భంగా సంగాం సంగమేశ్వర స్వామికి భక్తుల కానుకల రూపంలో రూ.54,784ల ఆదాయం వచ్చింది. సోమవారం స్వామి వారి హుండీని అధికారులు లెక్కించారు. ఆలయ ఈవో శ్యామలరావు, ఛైర్మన్ ఆనందరావు, మాధవరావు, ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి, సహ అర్చకులు సిద్ధాంతం చిన్నబాబు సమక్షంలో లెక్కింపు జరిగింది.



## అక్షరవెలుగు పుస్తకం ఆవిష్కరణ

**శ్రీకాకుళం, డిసెంబర్ 2(వార్త):** శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికలో అక్షర వెలుగు పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఈవో తిరుమల చైతన్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## వర్మీ కంపోస్టు విక్రయాన్ని ప్రోత్సహించాలి

**శ్రీకాకుళం, డిసెంబర్ 2(వార్త):** వర్మీ కంపోస్టు విక్రయాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం బయట ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మీ కంపోస్టు పంచాయతీల నుంచి స్వయం సహాయక సంఘాలకు సరఫరా చేస్తే వారు విక్రయిస్తారన్నారు. పంచాయతీలకు క్యూ ఆర్ కోడ్ ఉండాలని, దాని ద్వారా వర్మీ కంపోస్టు పేమెంట్ తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. మున్సిపాలిటీల నుంచి వర్మీ కంపోస్టు స్టాల్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్గానిక్ పంటలు పండించే రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారికి వర్మీ కంపోస్టు విక్రయంపై తెలియజేయాలని సూచించారు. ఉద్యాన శాఖ, ఉపాధి హామీ నుంచి అధికారులు వర్మీ కంపోస్టు ఉపయోగాలను రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీపీవో కె.భారతి, సౌజన్య, దూసి పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ సేవ సదన్‌లో ప్రీ లోక్ ఆదాలత్



**శ్రీకాకుళం, డిసెంబర్ 2(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో ప్రీ లోక్ ఆదాలత్‌ను నిర్వహించారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారి మూడు కేసులు, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారి 10 కేసులు, టాటాఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారి ఆరు కేసులు రాజీ అయ్యాయి.

## భూవివాదంపై ఫిర్యాదు



**సంతబొమ్మాళి, డిసెంబర్2(వార్త):** నౌపడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 347,486,485-3, 343లోగల తొమ్మిది ఎకరాల భూ వివాదంపై స్థానిక సచివాలయంలో బాధితురాలు పలికిల శ్రీలక్ష్మి సోమవారం ఫిర్యాదు చేశారు. వారసత్వంగా వస్తున్న ఈ సర్వే నెంబర్ భూములపై నలుగురు సోదర, సోదరీమణులకు హక్కులు ఉన్నప్పటికీ..తన సోదరుడు లోపింటి సునీల్ కుమార్ తప్పుడు పత్రాలు సృష్టించి భూములు అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. దీనిపై 2020లో కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టులో కేసు వేశామని తెలిపారు. ఈ భూములపై ఎటువంటి క్రయవిక్రయాలు జరిగిన సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుతారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. దీనికి సంబంధించి దరఖాస్తుతో పాటు కోర్టు పత్రాలను వీఆర్వో మంగులకు బాధితురాలు అందజేశారు.

## కృష్ణతేజ ఫంక్షన్ హాల్ ప్రారంభించిన అశోక్

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 2(వార్త):** ఇచ్ఛాపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నూతనంగా నిర్మించిన కృష్ణతేజ ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కమిషనర్ రమేష్, సాహుకారు లక్ష్మీ, భాను తేజ, హిమబిందు పాల్గొన్నారు.



# సమయానికి రారు..తెరవరు..!

■ వంగరలో విధులకు సరిగా హాజరుకాని హౌసింగ్ సిబ్బంది ■ సోమవారం మధ్యాహ్నం 1:30గంటలకు కూడా తెరుచుకోని కార్యాలయం

**వంగర, డిసెంబర్ 2(వార్త):** వంగరలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయం సోమవారం నాడు ఉదయం 1.30 గంటలకు కూడా తెరచుకోలేదు. తాళం వేసే ఉంది.

ఇక్కడి హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ గొర్జ పైడితల్లి ఇటీవల బాడంగి మండలానికి బదిలీఅయ్యారు. కానీ ఆయనను ఇక్కడికి కూడా ఇన్‌చార్జిగా అధికారులు కొనసాగించారు. అయితే ఆయన వారంలో ఒక రోజు కూడా హాజరుకావడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో సిబ్బంది హాజరు కూడా నామమాత్రంగానే ఉంటోంది. ఇలా అయితే పనులు కోసం వచ్చిన లబ్ధిదారులు పరిస్థితి ఎలా ఉంటోందో మరి చెప్పక్కర్లే. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# సంగాంకు పోటెత్తిన భక్తులు





**వంగర, డిసెంబర్ 2(వార్త):** పోలి పాడ్యమి కావడంతో సోమవారం నాడు పవిత్ర పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వరుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే మహిళలు భారీగా త్రివేణి సంగమం వద్దకు చేరుకుని, స్నానాలు ఆచరించి, దీపాలను వెలిగించి నదిలో విడిచిపెట్టారు. అనంతరం సంగమేశ్వరుడిని దర్శించారు. భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. స్వామి వారి దర్శనం అనంతరం పక్కనే ఉన్న వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఏ ఇబ్బందులు రాకుండా ఆలయ ఈవో శ్యామలరావు, చైర్మన్ బోను ఆనందరావు ఏర్పాట్లు చేశారు. శివాలయం వద్ద, వంగర ఈశ్వరాలయంవద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



# అర్హుల పింఛన్లు తొలగిస్తారా?

**టెక్కలి, డిసెంబర్ 2(వార్త):** అర్హుల పింఛన్ల తొలగింపు సరికాదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ స్వప్నిల్‌దినకర్‌కు ఫిర్యాదు చేశారు.

సోమవారం ఆయన శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ ఆవరణలో నిర్వహించిన ప్రజా మస్యల పరిష్కారవేదిక వద్ద కలెక్టర్‌ను లబ్ధిదారులతో పాటు కలిశారు. కోటబొమ్మాళి మండలం తాడిపత్తి సచివాలయం పరిధిలో 20 మంది పింఛన్లను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు అధికారులు నిలిపేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చెబితే పింఛన్ రద్దు చేస్తారా అని నిలదీశారు రద్దు చేసిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించకపోతే ఉద్యమిస్తానని హెచ్చరించారు. సంతబొమ్మాళి మండలంలో 35 మందికి కేటాయించిన హుదూద్ ఇళ్లను మంత్రి రద్దు చేయిస్తే, కోర్టును స్టే విధించిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట వివిధ గ్రామాల లబ్ధిదారులు ఉన్నారు.





## పంట నష్టం పై అంచనా

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 2(వార్త):** అకాల వర్షంతో ఇచ్ఛాపురం మండలంలో కొన్నిచోట్ల వరి చేను ఒరిగింది. కొన్నిచోట్ల పొలాల్లో నీరు నిల్వ ఉంది. ఒరిగినచోట వెంటనే నీరు బయటికి తీయకపోతే నష్టం వాటిల్లే ప్రభావం ఉంది. అయితే ఇంకను తేమ, మబ్బులతో కూడిన వాతావరణం నెలకొని ఉన్నందున ఒరిగిన చేను, పొలాల్లో పనలు మీద ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారిణి భార్గవి సూచించారు. లీటర్ నీటికి 100 గ్రాములు ఉప్పు కలిపి పనలపై పిచికారీ చేస్తే, మొలక రాకుండా ఉంటుందన్నారు.

ఎండ వచ్చిన వెంటనే పనలు తిరగేసి ఆరపెట్టాలని ఆమె సూచించారు. బూర్జపాడు గ్రామంలోని పొలాలను సోమవారం ఆమె సందర్శించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సాయుధ దళాల విరాళాల పోస్టర్ ఆవిష్కరణ



**శ్రీకాకుళం, డిసెంబర్ 2(వార్త):** శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికలో సాయుధ దళాల పతాక దినోత్సవం కోసం విరాళాలు సేకరణ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైద్య సేవలు సకాలంలో అందించాలి

**నరసన్నపేట, డిసెంబర్ 2(వార్త):** నరసన్నపేట ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.

సోమవారం ఆయన నరసన్నపేట ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే ఎంతో పేరు గాంచిన నరసన్నపేట ఆసుపత్రికి పూర్వ వైభవాన్ని తీసుకుని రావాలని వైద్యులకు స్పష్టం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇదే ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన విశ్రాంత వైద్యురాలు డాక్టర్ ఎం.పద్మావతిని అభివృద్ధి కమిటీలో నియమించామని, ఆమెకు ఆసుపత్రిపై సరైన అవగాహన ఉందన్నారు. ఆమె ఆసుపత్రిని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వైద్యులందరూ తప్పనిసరిగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు వైద్యాధికారులు పాల్గొన్నారు.



## దాడి, అట్రాసిటీ కేసులో నిందితురాలికి రెండేళ్ల జైలు శిక్ష

**శ్రీకాకుళం, డిసెంబర్ 2(వార్త):** భౌతిక దాడి, అట్రాసిటీ కేసులో నిందితురాలికి రెండేళ్ల జైలు శిక్ష, 10 వేలు జరిమానాను 4వ అదనపు జిల్లా కోర్టు జడ్జి విధించారు.

పి.చిన్నమ్మడు తన కుటుంబంతో కలిసి పాతపట్నంలోని యశోదా నగర్‌లో తన సొంత ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఆమె ఇంటికి తూర్పు వైపున గేదెల అమరావతి తన కుటుంబంతో కలిసి ఉంటున్నారు. వీరి ఇళ్ల మధ్య 9 ఇంచీల పిట్ట గోడ ఉంది. ఆ గోడపై కుండీల్లో అమరావతి పూల మొక్కలను పెంచుతోంది. వీటికి నీరు వేసేటప్పుడు, అవి బయటకు వచ్చి చిన్నమ్మడు మేడ పైన ఉన్న ధాన్యం, దుస్తులు తడిసిపోయేవి. దీనిపై ఆమె అమరావతిని నిలదీయగా, కులం పేరుతో దూషించింది. దీంతో ఆమె ఆ నీరు తన డాబా మీదకు రాకుండా ఉండడానికి ఓ గట్టును కట్టింది. అయితే దానిని అమరావతి విరగదీయబోగా, చిన్నమ్మడు నిలువరించింది.

దీంతో ఆమెను కులం పేరుతో మళ్లీ దూషించడమే కాకుండా, జగ్గు నీళ్లను ఆమె ముఖం పైకి విసరమేగాక, కుండీతో కొట్టింది. దీంతో ఆమె కుడిచేయి, నుదుటిపైన గాయాలయ్యాయి. ఆమె పాతపట్నం ప్రభుత్వాసుపత్రిలో చేరగా పోలీసులు కేసు నమోదు చేశారు.

దీనిపై శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు దర్యాప్తు చేసి, కోర్టుకు సమర్పించారు. నేరం నిరూపితం కావడంతో నిందితురాలు అమరావతికి రెండేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.10వేల జరిమానాను విధిస్తూ జడ్జి ఫణికుమార్ తీర్పు చెప్పారు. ఈ కేసును వి.రఘురాం వాదించారు.

## రిమ్స్‌కు శరీర దానం చేసిన పాపారావు

**టెక్కలి, డిసెంబర్ 2 (వార్త):** టెక్కలికి చెందిన కోళ్ల పాపారావు.. సావిత్రి భాయి పూలే ట్రస్ట్, విశాఖపట్నం వారి ప్రోత్సాహంతో తన శరీరాన్ని,. మరణాంతరం రిమ్స్ శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి దానం ఇవ్వడానికి అంగీకరించారు. అయితే ఆయన అనారోగ్యంతో సోమవారం మరణించగా, ఆయన శరీరాన్ని కుటుంబసభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు అప్పగించారు. ఆయన త్యాగాన్ని ప్రజలు, నాయకులు కొనియాడారు. ఆయన మృతదేహానికి ప్రజా సంఘాల నాయకులు పుచ్చ దుర్యోధన, ధర్మారావు, కారి పురుషోత్తం, దేవడా నారాయణ, బేలమర ప్రభాకరరావు, కోత ధర్మారావు, ధనలక్ష్మి, గంగయ్య, లోకనాథం, టెక్కలి పంచాయతీ వార్డ్ మెంబర్ పీత వెంకట రమణమూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మామిడి రాము, తెలుగుయువత నాయకులు నివాళులర్పించారు





## అనాథశ్రమంలో అటవీశాఖ సిబ్బంది

**సోంపేట, డిసెంబర్ 2(వార్త):** కాశీబుగ్గ, మందస అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలో కార్తీక వన సమారాధనను నిర్వహించారు. ఉసిరి, మారేడు, వేప, తులసి మొదలైన ఔషధ మొక్కల ఉపయోగాలు, కార్తీక వన సమారాధనతో ఆధ్యాత్మిక చింతన, ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని పిల్లలకు వివరించారు. వారికి ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాశీబుగ్గ అటవీ పరిధి అధికారి ఎ.మురళీకృష్ణంనాయుడు, మదలస డిప్యూటీ ఆర్వో ఐ.రాము, బీటు అధికారులు వెంకటేష్ లక్ష్మణమూర్తి, దుర్గాదేవి, భానుమూర్తి, జోగారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అటవీశాఖ సిబ్బందిని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అభినందించారు

## వలస మత్స్యకారులను ఆదుకోవాలి



**సోంపేట, డిసెంబర్ 2(వార్త):** చెన్నైలో వేట చేస్తున్న జిల్లాకు చెందిన వలస మత్స్యకారులు తుఫాన్ ప్రభావంతో కృష్ణపట్నం పోర్ట్‌లో పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కొన్నేళ్ల నుంచి ప్రభుత్వాలు అది చేస్తాం..ఇది చేస్తామని భ్రమలు కల్పించడమే తప్పా ఏమి చేయడం లేదని వలస మత్స్యకారులు ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులకు జెట్టీలు అంటున్నారు గానీ అవి ఎప్పటికీ పూర్తి చేస్తారో క్లారిటీ లేదని వాపోతున్నారు. మత్స్యకార భరోసా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీపై ఇంజన్లు, బోట్లు వలలు ఇవ్వాలని కోరుతున్నారు. తుఫాన్ల సమయంలో ఆర్థిక సహాయం అందించాలని విన్నవిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమను ఆదుకోవాలని వలస మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.



### టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ..

# నర్సుల కొరత

-రోగులకు అరకొరగా వైద్య సేవలు

-ఎవరైనా సెలవు పెడితే అవీ గగనమే

-మంత్రి దృష్టి సారించాలని టెక్కలి వాసుల విన్నపం

**టెక్కలి, డిసెంబర్ 2 (వార్త):** టెక్కలి జిల్లా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల కొరతతో పేషెంట్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇచ్ఛాపురం నుం టెక్కలి వరకు ఉన్న ప్రతి పి.హెచ్.సి, సి.హెచ్.సి, ఏరియా ఆసుపత్రుల నుంచి కేసులన్నీ టెక్కలి జిల్లా హాస్పిటల్‌కే వస్తూ ఉంటాయి. అయితే అక్కడి ఎమర్జెన్సీ వార్డ్‌లో వైద్యం అందివ్వడానికి కేవలం ఒకేఒక్క స్టాఫ్ నర్స్ మాత్రమే ఉన్నారు. ప్రతి వార్డ్‌లో ఇదే పరిస్థితి. ఒక షిఫ్ట్‌లో సుమారు 10 మంది పైగా ఉండాల్సి ఉండగా, కేవలం ఐదుగురు లేక ఆరుగురు మాత్రమే ఉంటున్నారు. ఒకవేళ ఈ ఐదుగురిలో ఎవరైనా సెలవు పెడితే ఆ రోజు పేషెంట్లకు వైద్యం చాలా ఆలస్యమవుతోంది. మంత్రి అచ్చెన్నాయుడు ఈ ఆసుపత్రిపై దృష్టి సారించి, స్టాఫ్‌నర్స్‌లను నియమింపజేయాలని టెక్కలి ప్రజానీకం కోరుతున్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎమ్మెల్యే అశోక్ కారు ఢీకొని వృద్ధుడు మృతి

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 2 (వార్త):** ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన కృష్ణ తేజ ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కొఠారి ఏఎంసి మాజీ అధ్యక్షుడు సాడి సహదేవ్ రెడ్డి అన్నయ్య జోగారావు కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్నారు. తిరిగి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన పాలేపు ఆగంధరావు(77) కారు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే కారులో ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఆ వృద్ధుడిని చేర్పించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి సరిగ్గా కళ్లు కనిపించవు. అరుగులపై కూర్చుని అందరూ ఇచ్చే ఆహారం తీసుకుని జీవిస్తుంటాడు. బేల్లుపడా కాలనీ కి చెందిన పాలేపు దివాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ ప్రగడ మణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఇ. శ్రీనివాసరావు చెప్పారు.

# విద్యతోనే అభివృద్ధి

- విలువలతో కూడిన విద్యను అందించండి
- పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం
- ఎమ్మెల్యే కూన రవికుమార్
- కేజీబీవీ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**ఆమదాలవలస, డిసెంబరు 2 (వార్త):** విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని, విద్యార్థులు బాగా చదివి రాణించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. సోమవారం ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని తాళ్లవలస కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు సత్యసాయి సేవా సమితి సమకూర్చిన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకారం అందించాలని కోరారు.



ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. పిల్లలు ఇంటి వద్ద చదివేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు 234 విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, సంపదరావు మురళీధరరావు, తమ్మినేని అమర్నాథ్, ఎన్ని శ్రీదేవి, సత్యసాయి సేవా సభ్యులు, కేజీబీవీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





## విద్యార్థినులను తీర్చిదిద్దే బాధ్యత..

# ఉపాధ్యాయులదే

*** ఎమ్మెల్యే మామిడి గోవిందరావు * హిరమండలం కేజీబీవీలో లైబ్రరీ, కంప్యూటర్ రూమ్‌లకు శంకుస్థాపన**

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, డిసెంబర్2(వార్త):** కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులను తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులే తీసుకోవాలని, వారికి విలువలతో కూడిన విద్యను అందించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. హిరమండలం కేజీబీవీలోని లైబ్రరీ, కంప్యూటర్, రూములను సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.









## ఏసు మార్గం అనుసరణీయం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- నగరంలో పలు చర్చిల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 2 (వార్త):** ప్రపంచంలో శాంతి కోసం పరితపించిన ఏసుప్రభువు అనుసరించిన మార్గం యువతకు అనుసరణీయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని తెలుగు బాప్టిషన్ చర్చ్, ఎస్ కన్వెన్షన్ తదితర ప్రాంతాల్లో ఉన్న చర్చిల్లో సోమవారం నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్ పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక రక్షణ కోసం జన్మించిన ప్రభువు అయిన ఏసుక్రీస్తు యావత్ ప్రపంచానికి శాంతి, ప్రేమతో జీవించాలని ప్రబోధించారన్నారు. మనం ఏస్థాయిలో ఉన్నా మనిషిని మనిషిగా గుర్తించి, వారి అవసరాలు తమ అవసరాలుగా సహాయ పడాలన్నారు. సమాజంలోని ప్రతీ ఒక్కరు పొరుగు వారిపై ప్రేమ, అప్యాయతను కనబరచాలన్నారు. ఏసు చూపిన మార్గం ద్వారా సమాజంలో శాంతి, సౌభాతృత్వం వెల్లి విరుస్తుందన్నారు. క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి బాటలు అని పేర్కొన్నారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవ సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పులి సంచారంపై వదంతులు ప్రచారం చేయొద్దు

**సారవకోట,డిసెంబర్ 2 (వార్త):** పులి సంచారంపై వదంతులను ప్రచారం చేయవద్దని మండల అటవీ అధికారి ఎల్.ఈశ్వరరావు కోరారు. పాతపట్నం మండలం బూరగాం, గురండి ప్రాంతాల్లోని కొండల్లోకి పులి చేరినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందని, ఇది అవాస్తవమన్నారు. సారవకోట మండలంలోని సోమయ్యపేట గ్రామ పరిధిలో పులిని స్థానికులు చూశారని, పాద ముద్రలు కూడా గుర్తించినట్లు చెప్పారు. పుల్లి ఎక్కడ తిరుగుతున్న దానిపై సోమవారం పాతపట్నం, సారవకోట మండలాల పరిధిలో ఉన్న తెంబూరు, బొంతు, నారాయణపురం, వాండ్రాయి, బెజ్జి, చిన్నగుజ్జువాడ, అన్నుపురం తదితర గ్రామాలు తిరిగి వాకబు చేశామని, కొండ అంచుల్లో తిరిగినప్పటికీ ఎక్కడా పాద ముద్రలు, అది కనిపించినట్లు ప్రజల నుంచి సమాచారం లేదన్నారు.

## 'ఐదు నెలల్లోనే చార్జీలు పెంచేశారు'

**శ్రీకాకుళం, డిసెంబర్ 2 (వార్త):** కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు సంవత్సరాల వరకు కరెంటు చార్జీలు పెంచనని చెప్పి కేవలం ఐదు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి తన మార్క్ నయవంచనతో తాను ఇచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ మరోసారి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన బాబు చెప్పిన షూరిటీ ఏమో గాని ప్రజలకు బాధలు గ్యారెంటీ అన్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. ఎన్నికల ప్రచారంలో చార్జీలు తగ్గిస్తానని ఊరువాడ ప్రచారం చేసి విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ట్రూ ఆఫ్ చార్జీలు కూడా ఎత్తేస్తామని నాడు బేరాలు పోయిన బాబు తాను ఏ హామీ ఇవ్వలేదంటూ ఇప్పుడు నిస్సిగ్గుగా బుకాయిస్తున్నారని విమర్శించారు.

## మద్యం షాపును తరలించాలని కలెక్టర్‌కు వినతి

**శ్రీకాకుళం, డిసెంబర్2 (వార్త):** కొత్తరోడ్డులోని ఆర్మీ క్యాంటీన్ వెనుక ఉన్న వేంకటేశ్వర కాలనీలోని గెడ్డ పక్కన ఏర్పాటు చేసిన మద్యం షాపును తరలించాలని కాలనీవాసులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం జడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మందుబాబులు మద్యం తాగి అపార్టుమెంట్లు, ఇళ్ల వద్ద గొడవలకు దిగుతున్నారన్నారు. రాత్రివేళ ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు జగదీశ్వరరావు, జి.సురేష్, సాయితేజ, కుమారస్వామి, శ్రీనివాసరావు, సనపల రుషి, తదితరులు ఉన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Working Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546